రేవంత్‌రెడ్డి మల్కాజిగిరికి ఒరగబెట్టిందేమి లేదు

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- ప్రజా సంక్షేమం కోసం పాటుపడే రాగిడిని గెలిపించుకోవాలి
- కుత్బుల్లాపూర్‌లో విస్తృత ప్రచారం



కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ మైదానంలో వాకర్స్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్, మార్చి 30: గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ ఒరగబెట్టిందేమిలేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ మైదానంలో వాకర్స్‌తో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ ఎంపీగా గెలిచి ఏనాడు ఇక్కడి సమస్యలు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తన సొంతంగా తీసుకొచ్చిన దాఖలాలే లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలకు ప్రజలకు చేరవేయడంతోపాటు అనుభవం ఉన్న వ్యక్తి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకొని అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, విజయరామ్‌రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం

మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని శ్రీగోదాసమేత వెంకటేశ్వర స్వామి వార్ల కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. శుక్రవారం ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం జరిగిన నేపథ్యంలో తొలిసారిగా స్వామి వారి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. కాగా, ఈ కల్యాణానికి చిన జీయర్‌స్వామి హాజరయ్యారు. కాగా, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి.

– మియాపూర్, మార్చి 30

రాజేశ్‌ఖన్నాకు జేఎన్‌టీ యూహెచ్ డాక్టరేట్

రాజేశ్‌ఖన్నా

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 30 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న భూత్కూరి రాజేశ్‌ఖన్నా పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్ స్పెషలైజేషన్‌లో చేసిన పరిశోధనలకు గాను జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, అవసరాలకనుగుణంగా వివిధ రకాల పునరుత్పాదక ఇంధనాలపైన ఆధారపడుతున్న నేటి రోజుల్లో డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ సిస్టమ్ సోలార్ విండ్ ఇతర హైబ్రీడ్ ఎనర్జీ సిస్టమ్ ద్వారా పవర్‌ను జనరేట్ చేయడం వాటన్నింటినీ సమర్థవంతమైన పవర్ ఎలక్ట్రానిక్స్ కన్వర్టర్లు, ఇన్వర్టర్ల ద్వారా ఎలక్ట్రిక్ గ్రిడ్‌కి అనుసంధానించడం, ఎలక్ట్రిక్ గిడ్‌ని వర్చువల్ ఎలక్ట్రిక్ మిషన్‌గా పరిగణించి తద్వారా పవర్ అనేది గ్రిడ్ నుంచి డీసీ లోడ్‌కు ఎలా ప్రవహిస్తుంది. సూపర్‌వైజర్ పూసమ్ ఉపాధ్యాయ, జె.అమర్‌నాథ్ కుటుంబ సభ్యులకు ఈఈఈ విభాగం అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మానవ జీవితంపైన 'ఏఐ' ప్రభావం

జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సదస్సులో ఏఐ పనితీరును వివరిస్తున్న అడిషనల్ డీజీపీ షిఖా గోయల్

అడిషనల్ డీజీపీ షిఖా గోయల్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 30 : మానవ జీవితంలో ప్రతి అంశంపైన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ప్రభావం ఉంటుందని తెలంగాణ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ అన్నారు. శనివారం వర్సిటీ ఆడిటోరియంలో ఏఐ, మిషన్ లర్నింగ్(ఎంఎల్)లపై ఏఐ డేస్-2024 అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా తెలంగాణ అడిషనల్ డీజీపీ షిఖా గోయల్, పద్మభూషణ్ వీఎస్.రామచంద్రన్, మొబైల్ పేమెంట్స్ ఫోరం ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ గౌరవ్ రైనా, ఒజేనేటల్ ఫౌండర్ సీఈవో చైతన్య, టెక్ మహేంద్ర వీపీ నాగమల్లాది, స్వేచ్ఛా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కిరణ్‌చంద్ర, ఫేజ్‌బుక్ ఇండియా డైరెక్టర్ సునీల్ అబ్రహమ్, టెక్ వేదిక ఫౌండర్ సీఈవో సాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో భారతదేశం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లర్నింగ్‌లకు రాజధానిగా మారుతుందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో భవిష్యత్‌లో విద్య, పోలీస్, శాస్త్రసాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయన్నారు. ఏఐతో లక్షలాది ఉద్యోగాలు కోల్పోతామని భావించడం సరికాదని, అదే సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. సదస్సులో తెలుగు ఏఐను ప్రారంభించి రైతులకు, వైద్యులకు, పారిశుధ్య కార్మికులు, ఇతరులకు ఉపయోగపడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతనిధులు, విద్యార్థులున్నారు.

సమీక్ష సమావేశంలో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణరావు తదితరులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సమీక్ష

దుండిగల్,మార్చి30 : ఎండలు మండుతుండటంతో మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన వేసవి కాలంలో మూడు నెలల పాటు మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసే విషయమై హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ(జలమండలి), మిషన్ భగీరథ, మున్సిపల్ ఏఈ, వార్డు ఆఫీసర్లు, వాటర్ మెన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వేసవి కాలం పూర్తయ్యే వరకు వాటర్ మెన్‌లు సమన్వయంతో పనిచేయలాని ఆదేశించారు. తాగునీరు పరఫరా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు. సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి పరిష్కరింపజేయాలని సూచించారు. హెచ్ఎండబ్ల్యూస్ అండ్ ఎస్‌బీ డీజీఎం మహేశ్వరరావు,మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజినీర్ వసుధ వార్డుల వారీగా సరఫరా చేస్తున్న నీటి పరిమాణం గురించి తెలియజేస్తూ రోజు విడిచి రోజు ప్రతి కుటుంబానికి నీరు సరఫరా చేసేందుకు తగు సూచనలు ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో వాటర్ లైన్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని వార్డు ఆఫీసర్లకు, వాటర్‌మెన్‌లకు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ ఏఈతో పాటు మేనేజర్ నర్సింహులు, వార్డు ఆఫీసర్లు, వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

అంబీర్ చెరువును సుందరీకరిస్తాం

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువును నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌తో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు శనివారం పరిశీలించారు. గుర్రపు డెక్కతో అపరిశుభ్ర వాతావరణంతో దోమలు పెరిగి తీవ్ర అసౌకర్యంగా ఉన్నదని స్థానికులు వారికి విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. చెరువులో గుర్రపు డెక్క నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గాంధీ తోడ్పాటుతో నిధులు మంజూరు చేయించి చెరువును సుందరీకరిస్తామని, వాకింగ్ ట్రాక్, పచ్చదనం, ఆట పరికరాలు సహా ఇతర వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నవీన్, ధర్మారెడ్డి, వేణుగోపాల్, రమేశ్, శివ, మనోహర్, రఘు, సుబ్బరాజు పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 30

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గాంధీ

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ మసీదులో నిర్వహించిన దవాత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు ప్రత్యేక ప్రార్థనలతో అల్లాహ్ అనుగ్రహం పొందాలని కోరారు. హిందు ముస్లింలు సోదర భావంతో మెలగాలని, ఇఫ్తార్ విందులో ఆ గొప్ప సంప్రదాయాన్ని చాటుతున్నాయని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, మసీదు కమిటీ ప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 30

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, స్థానికంగా నెలకొన్న ప్రతీ సమస్యతో పాటు తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు,బస్తీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిశారు. అనంతరం పలువురు శుభకార్యాలకు రావాలని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– దుండిగల్,మార్చి 30

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం సాంస్కృతిక ప్రదర్శనలు సందడిగా సాగాయి. ఎస్‌వీఎస్ కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కళానీరాజనం' కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో హేమ పనసర్ల శిష్య బృందం వినాయకౌతం, చక్కనితల్లికి, బాలాత్రిపుర సుందరి, మూషిక వాహన, పలుకే బంగారమాయేనా, ముద్దుగారే యశోద, రామ కోదండ రామా, అయిగిరి నందిని, జతిస్వరం, అష్టలక్ష్మి, పుష్పాంజలి, అన్నిమంత్రములు అంశాలను జస్వితశ్రీ తన్మయి, హర్షిని, శ్రీదర్శిని, సహస్ర, అనన్య, అనూష, శ్రీప్రియ, ధన్వింత, రితిక, భవ్యశ్రీ కాత్యాయిని, వర్షలు తమదైన శైలిలో నర్తించి అలరించారు. –కొండాపూర్, మార్చి 30

బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. ఏప్రిల్ 5న నిర్వహించబోయే బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి, అస్మత్‌పేట దళిత ఐక్యవేదిక సభ్యులు కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ను కలిసి ఆహ్వానించారు. కార్పొరేటర్ కలిసివారిలో గడ్డం నరసింహ, బుర్రి యాదగిరి, బాల్ నిరసంహ, ఎన్.రాజేందర్, జి.జగదీశ్, శశికళ, రోజా, ప్రదీప్, రాజు, గణేశ్, శివ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

– అల్లాపూర్, మార్చి30

టీ -హబ్‌లో నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల ప్రదానోత్సం

విజయ సాధనలో దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం అవసరమని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. పారిశ్రామిక రంగాల్లో ప్రతిభ చాటుతున్న 60 మంది పారిశ్రామికవేత్తల విజయాలను గుర్తిస్తూ ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల వేడుక నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆదాయ పన్ను కమిషనర్ జీవన్‌లాల్ లవిడియాలతో కలిసి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ ప్రాపర్టీస్ ఎండీ తమ్మినేని సత్యనారాయణ, సంకల్ప్ గ్రూప్ ప్రతినిధి వీర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

– కొండాపూర్, మార్చి 30

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించండి

దేశాభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలాజీనగర్, మూసాపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు పేదలందరికీ అందాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 30

మెగా యూనివర్సిటీ ఫెయిర్

గచ్చిబౌలిలోని ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం మెగా యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో 80కి పైగా దేశాలకు చెందిన పలు యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ కొల్లి, వైస్ ప్రిన్సిపాల్ వాణి, కౌన్సెలింగ్ విభాగం అధిపతి రజిత, పలువురు అతిథులు మాట్లాడుతూ.. ఈ యూనివర్సిటీ ఫెయిర్ ద్వారా విద్యార్థులకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు.

– శేరిలింగంపల్లి, మార్చి 30

నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ

జగద్గిరిగుట్ట, మార్చి 30 : నీటిని సంరక్షించడం భూమిని కాపాడటమేనని విద్యార్థులు నినదించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో శనివారం పాఠశాలల విద్యార్థులు, స్థానికులతో కలిసి శాంతికోసం నీరు పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి ఆదా, వేసవిలో వినియోగంపై జాగ్రత్తలు వివరించారు. జలమండలి కార్యాలయం నుంచి గుడెన్‌మెట్ ప్రాంతాల్లో తిరిగి కరపత్రాలు పంచారు. స్థానిక నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలసంరక్షణ ర్యాలీలో విద్యార్థులు

ప్రభుత్వ స్థలం చదును..అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

జేసీబీ వాహనాలతో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

దుండిగల్, మార్చి 30 : కొందరు ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని జేసీబీలతో చదును చేస్తుండగా.. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా పనులను నిలిపివేయించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, మల్లంపేట్‌లోని సర్వే నంబర్ 170, ప్రభుత్వ స్థలంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు శనివారం సాయంత్రం జేసీబీలతో వచ్చి స్థలాన్ని చదును చేస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సర్వేయర్ తాత్కాలికంగా పనులు నిలిపి వేయించారు. అయితే అది ప్రభుత్వ స్థలమని స్థానికులు చెబుతుండగా, అక్కడి స్థలాన్ని చదును చేస్తున్న వారు మాత్రం అదిప్రైవేట్ స్థలమని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో స్థలం సర్వే నిర్వహించే వరకు ఎటువంటి పనులు చేయొద్దని సర్వేయర్ సూచించడంతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా, గత కొంత కాలంగా మల్లంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ, కొందరు విల్లాల యజమానుల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మళ్లీ శనివారం ప్రభుత్వస్థలం చదును చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయమై గండిమైసమ్మ-దుండిగల్ మండలం తహసీల్దార్ మతిన్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

నిజాంపేట్‌లో నేడు ఉచిత వైద్యశిబిరం

దుండిగల్, మార్చి 30 : బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి చెందిన మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 12వ డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ ఫేజ్-2, కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో కిమ్స్ వైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది హాజరై శిబిరంలో పాల్గొనే ప్రజలకు ఉచితంగాజనరల్ మెడిసిన్, గుండె సంబంధిత వ్యాధులు, ఆర్థోపెడిక్ (కీళ్లు, ఎముకలు), పిడియాట్రిక్స్ (చిన్నపిల్లలు), గైనకాలజీ (స్త్రీ సంబంధిత వ్యాధులు), ఆప్తాల్మాలజీ (నేత్ర సంబంధిత), ఎలక్ట్రోకార్డియోగ్రాం(ఈసీజీ) వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన రన్వితగానం



వేంకటేశ్వర స్వామి సంకీర్తనలను ఆలపిస్తున్న రన్విత

మాదాపూర్, మార్చి 30: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో వేంకటేశ్వరస్వామి సంకీర్తనలు శ్రోతలను అలరించాయి. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులతో కలిసి శనివారం సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులు తొలుత శ్రీవిష్ణు సహస్రనామం, లక్ష్మీఅష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం, శ్రీ మద్వదీయ అన్నమయ్య గురుస్తుతితో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శోభరాజు విదార్థిని రన్విత అన్నమయ్య సమేత శ్రీస్వర సిద్ధి వేంకటేశ్వర స్వామికి హరి యవతారమితడు, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, పసిడి ఊయల వంటి సంకీర్తనలను ఆలపించి అలరించింది. అనంతరం శోభరాజు రన్విత జ్ఞాపికను అందజేసి సత్కరించారు. వేంకటేశ్వర స్వామికి హారతి అందించి ప్రసాద వితరణ చేశారు.

సుచిత్రలో మలబార్‌గోల్డ్ షోరూం ప్రారంభం

సుచిత్రలో మలబార్‌గోల్డ్ షోరూంను ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకులు, ఆయా పార్టీల శ్రేణులు

కుత్బుల్లాపూర్,మార్చి30:ఆభరణాల వ్యాపారంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన మలబార్ గోల్డ్, డైమండ్స్ నూతన బ్రాంచ్ సుచిత్ర చౌరస్తాలో శనివారం ప్రారంభమైంది. ఆయ పార్టీల శ్రేణులు చెరుకుపల్లి భరత్, సుధాకర్‌గౌడ్, షరీఫ్, మర్వాన్, బినుఫ్, నార్లకంటి దుర్గయ్యతోపాటు మలబార్ నిర్వాహకులు, సిబ్బందితో కలిసి ఘనంగా ప్రారంభించారు. కస్టమర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 30 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 38, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 60, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 60, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 28, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 15, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 19, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 60, పొప్పడికాయ 40, పుట్ట గొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 200, అల్లం 180, వెల్లుల్లి 200, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతు బజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నిషేధిత చరస్ మందు పట్టివేత.. ఒకరి అరెస్టు

ఉదయ్‌కుమార్

దుండిగల్, మార్చి 30: నిషేధిత చరస్ మందును విక్రయిస్తున్న ఓ నిందితుడిని దుండిగల్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి చరస్ మందుతోపాటు రూ.11వేల నగదు, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం... ఏపీకి చెందిన కనగల ఉదయ్‌కుమార్(29) అనే యువకుడు దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని ఎస్ఆర్‌కే హోమ్స్‌లోని 12వ నంబర్ విల్లాలో అద్దెకు ఉంటూ డాగ్ బ్రీడర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఉదయర్‌కుమార్ నిషేధిత చరస్ మందును విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శనివారం ఉదయం ఉదయ్‌కుమార్ దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజుకాలనీలో ఓ కస్టమర్‌కు మందును విక్రయిస్తుండగా పోలీసులు అతడిని వెంబడించారు. దీంతో చెట్లపొదల మధ్యన అనుమానాస్పదంగా తచ్చాడుతూ పోలీసులకు దొరికిపోయాడు. అతడి వద్ద నుంచి ఓ సంచిలో చరస్ మందు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో చరస్‌మందును హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెప్పించి విక్రయిస్తున్నట్లు ఉదయ్ కుమార్ అంగీకరించాడు. అతడి వద్ద ఉన్న సెల్ ఫోన్, మందు విలువ రూ.90వేల వరకు ఉంటుందన్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా ఉదయ్‌కుమార్ ఉన్నత చదువులు పూర్తి చేసిన అనంతరం ఈ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. అతని తండ్రి రామ్మోహన్‌రావు,కుటుంబసభ్యులు కూకట్‌పల్లిలో నివాసముంటున్నారని పోలీసులు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అశోక్ నేత అన్నారు. హఫీజ్‌పేట్ హుడా కాలనీలోని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్, హోప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అశోక్ నేత విచ్చేసి హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 73 వారాలుగా అన్నదాన కార్యక్రమాన్ని చేయడంతో క్లబ్ ఫౌండర్ కొండా విజయ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పాపిరెడ్డి కాలనీకి చెందిన వికలాంగుడు వెంకటయ్యకు వీల్‌చైర్ కొనుగోలు చేసేందుకు రూ.20వేల చెక్కును అశోక్ నేత అందజేశారు. అనంతరం క్లబ్ ఫౌండర్ కొండా విజయ్‌తో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనాన్ని వడ్డించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ అధ్యక్షుడ